## 16

# అద్భుతముల తొలి సముదాయం

## (8:1-17)

ఇంత వరకు, యేసు పరిచర్య ఉపదేశించుట, బోధించుట మరియు స్వస్థపరచటంతో కూడినదై యుండినది. మత్తయి వ్రాసిన సువార్త చిత్రీకరించుచువచ్చినది (4:23; 9:35 చూడు). ఇప్పుడు యేసు చేసిన అద్భుతములను వివరించుచున్నాడు, ఈ అద్భుతములు ఎక్కువగా స్వస్థపరచుట గూర్చినవై యున్నవి (8; 9 అధ్యాయములు). ఈ అద్భుతములు మూడేసి చొప్పున మూడు గుంపులుగా విభజింపబడినవి, ఏడవ అద్భుతమునకు సంబంధించిన సంఘటన వాస్తవమునకు రెండు అద్భుతములు ఒకే ఘటనలో కలిసియున్నవై యున్నది. ఈ విధంగా మనకు మొత్తము పది అద్భుతములు సవివరంగా నివేదింపబడి యున్నవి. మూడేసి చొప్పున నున్న ఈ అద్భుతములు (8:1-17; 8:23-9:8; 9:18-34) శిష్యత్వాన్ని నొక్కి చెప్పే రెండు ఉపదేశ విభాగాలు వేరుచేసాయి (8:18-22; 9:9-17).

యేసు ఈ అద్భుతములు ఎందుకు చేసాడు? అవి ఏ యే ఉద్దేశములను నెరవేర్చినవి? యేసుక్రీస్తు కనికరముగలవాడై యుండియు ఆయన రోగులై యుండిన ప్రతి ఒక్కరిని స్వస్థపరచలేదు లేక చనిపోయిన ప్రతి ఒక్కరిని లేప లేదు, అలాగైతే ఆయన ఈ అద్భుతములను ఎందుకు చేసినట్టు?

మొదటిది, మానవుల దురవస్థలతో కూడిన దుఃఖమును తొలగించుచు సాధ్యపడినపుడెల్లా వారి అవసరములను తీర్చునట్లు యేసు ఈ అద్భుతములను చేసాడు. రెండవది, ఈ అద్భుతములు ఆయన మెస్సీయాయై యున్నాడని సాధికారముతో ఆయన చెప్పిన మాటలకు న్యాయసమ్మతమైన నిదర్శనమును సమకూర్చినవి (యోహాను 20:30, 31) మరియు ఆయన గూర్చి పలుకబడిన పాత నిబంధన ప్రవచనములను నెరవేర్చినవి (యెషయా 29:18, 19; 35:4-6).

అందరి ధ్యాసను ఆయన వైపే ఆకర్షించుకొనవలెనను ఉద్దేశముతో యేసు తన అద్భుతములను ఎన్నడును చేయలేదు, ఏలయనగా ఆయన తన పరిచర్యయందంతటను ఇటువంటి లోకప్రసిద్ధత నుండి దూరముగా తప్పించుకొనుటకు వెదికాడు. ఆయన చేయుచుండిన ఆశ్చర్యకార్యములనుబట్టి ప్రజలందరు ఆశ్చర్యజనకము గావింపబడవలెనని ఆయన ఆశించలేదు. వారి విశ్వాసము వాస్తవముగా ఆయన ఎవరై యుండిన విషయముపైనే కేంద్రీకృతమైనదై యుండవలెను. “కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగునని” పౌలు పలికాడు (రోమీయులకు 10:17).

భవిష్యత్తుకు సంబంధించినంత వరకు, పరిచర్య నిమిత్తము ఆయన పంపించుచుండిన అపొస్తలులు చేయగలుగుదురని యేసు ఘోషించాడు. యేసు చేసిన సూచక క్రియలు మరియు మహత్కార్యముల వలెనే, ఈ “సూచక క్రియలు” కూడ ప్రయోజనపడును

(మార్కు 16:20; హెబ్రీయులకు 2:1-4 చూడు). ఆయన వారికిచ్చిన వాగ్దానము నెరవేరినప్పుడు, వారు బోధించుచుండిన వాక్యము అది దేవుని యొద్ద నుండి వచ్చినదని నిశ్చయపర్చుకొనుటకు అపొస్తలులు ఇటువంటి మహత్కార్యములను ప్రయోజనకరంగా ప్రయోగించుకొన్నారు (2 కొరింథీయులకు 12:12).

మత్తయి 8:1-17 యేసు చేసిన మూడు అద్భుతములను తెలియజేయుచున్నది. ఈ అద్భుతముల ద్వారా ప్రయోజనము పొందిన ప్రతి ఒక్కరు యూదుల చేత హీనముగా ఎంచబడుచుండిన ప్రజాగుంపునకు చెందినవారై యున్నారు. యేసు ఒక కుష్ఠరోగిని ఒక అన్యుని, మరియు ఒక స్త్రీని స్వస్థపరచాడు.

## కుష్ఠరోగిని స్వస్థపరచుట (8:1-4)

**1ఆయన ఆ కొండమీదనుండి దిగి వచ్చినప్పుడు బహు జనసమూహములు ఆయనను వెంబడించెను. 2ఇదిగో కుష్ఠరోగి వచ్చి ఆయనకు మ్రొక్కి–ప్రభువా, నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవనెను. 3అందుకాయన చెయ్యి చాపి వాని ముట్టి–నాకిష్టమే, నీవు శుద్ధుడవు కమ్మని చెప్పగా తక్షణమే వాని కుష్ఠరోగము శుద్ధి యాయెను. 4అప్పుడు యేసు– ఎవరితోను ఏమియు చెప్పకు సుమీ; కాని నీవు వెళ్ళి వారికి సాక్ష్యార్థమై నీ దేహమును యాజకునికి కనుబరచుకొని, మోషే నియమించిన కానుక సమర్పించుమని వానితో చెప్పెను.**

**వచనము 1.** "బహు జనసమూహములు" ఆయనను వెంబడించుచుండరని నాలుగవ అధ్యాయము యొక్క ముగింపు సూచించినది (4:25). ఆయన కొండ మీదకు వెళ్లి తన శిష్యులకు బోధించు తరుణమును ఆయన చేజిక్కించుకొనునట్లు ఆయనను వెంబడించుచుండిన జనసమూహము ఆయనను బలముగా ప్రోత్సాహించినదని కూడ ఐదవ అధ్యాయం యొక్క ఆరంభం తెలియజెప్పుచున్నది. ఆ సుదీర్ఘ ప్రసంగము తరువాత (5–7 అధ్యాయములు), ఆయన **కొండ మీద నుండి దిగి వచ్చెను**. ఇదే విధమైన భాష నిర్గమకాండము 34:29లో, పది ఆజ్ఞలు గల రెండు పలకలతో మోషే సీనాయి కొండ మీద నుండి దిగివచ్చిన సందర్భములో గమనించనగును. యేసు చేయుచుండిన అద్భుతములను కళ్లారా చూచుటకు అసంఖ్యాకమైన సాక్షులుండిరను విషయము, ఆయనను బహు జనసమూహము వెంబడించుచుండినదను వాస్తవమును సూచించుచున్నది. ఈ అద్భుత కార్యములకు సంబంధించిన వృత్తాంతము ఆయన చుట్టూర గుమికూడియుండిన జనసమూహమును గూర్చిన ప్రస్తావనతో మొదలగుచు అదే ప్రస్తావనతో ముగియుచున్నది (8:1; 9:36–38).

**వచనము 2.** కుష్ఠరోగము యేసు దినములలోను, పాత నిబంధన కాలములోను నిస్త్రాణమును పుట్టించు ఉపద్రవమై యుండినది (లేవీయకాండము 13; 14; సంఖ్యాకాండము 12:10, 12). బైబిలులో పేర్కొనబడిన కుష్ఠరోగము, ఈ రోజుల్లో ప్రబలి యున్న కుష్ఠరోగము వంటిదో కాదో (Hansen's Disease) యని వైద్య సిద్ధాంతములను ప్రతిపాదించువారు భిన్నాభిప్రాయములుగలవారై యున్నారు. "కుష్ఠరోగము" ("leprosy," *lepra*) అను పదము ఏదైన ఒక్క చర్మ వ్యాధిని కాదు కానీ (psoriasis, eczema, vi-

tiligo, tuberculoid leprosy, and leukodermia) నానావిధములైన చర్మ వ్యాధులను సూచించియుండవచ్చును.

ఆశ్చర్యజనకముగా, ఈ **కుష్ఠరోగి** యేసును సమీపించుటకు సాహసించాడు. ధర్మశాస్త్రము ప్రకారము, "అపవిత్రుడను! అపవిత్రుడను!" అని బిగ్గరగా కేకవేయుచు, ఇతరులు వానిని సమీపించవద్దని వారిని హెచ్చరించవలసినవాడై యున్నాడు (లేవియకాండము 13:45, 46; సంఖ్యాకాండము 5:2–4). యేసు పది మంది కుష్ఠరోగులను స్వస్థపరచినప్పుడు, వారు "దూరమున నిలచి" యుండిరి (లూకా 17:12). దానికి బదులుగా, మనము చదువుకొనుచున్న ఈ కుష్ఠరోగి యేసు యొద్దకు వచ్చి, **ఆయన యెదుట వంగి ఆయనకు నమస్కరించాడు**. వాడు యేసుకు "మ్రొక్కాడని" KJVలో వ్రాయబడియున్నది. *Proskuneō* అను గ్రీకు క్రియా పదము దేవుని ఆరాధించుటకు ఆయన యెదుట లేక యేసు మెస్సీయ సంబంధిత రాజైయున్నాడని ఆయన యెదుట నమస్కరించుటను తెలియజేయుటకు తరుచుగా ప్రయోగింపబడుచున్నది (2:2పై గల వ్యాఖ్యానమును చూడు).

**ప్రభువా, నీకిష్టమైతే నన్ను శుద్ధినిగా చేయగలవని** ఈ కుష్ఠరోగి యేసునడిగాడు. వానిని స్వస్థపరచుటకు యేసు సమర్థవంతమైనవాడో కాదో యను సంశయమును వాడు వ్యక్తముచేయలేదు; కానీ వాని యెడల యేసు ఒక అద్భుతకార్యమును చేయుటకు ఇష్టపడుచున్నాడో లేదో యని మాత్రమే వాడు ప్రశ్నించుచుండెను. కుష్ఠరోగము పాపము వలన కలిగిన ఒక శిక్ష యను యూదుల సాంప్రదాయ దృష్టికోణము వాడదగిన ఈ ప్రశ్నకు ఒక హేతువై యుండవచ్చును. ఇటువంటి పాపములలో దేవుని నామమును దూషించుట, లైంగిక అవనీతి, నరహత్య, విగ్రాహారధాన, మరియు ముఖ్యంగా ఒకని గౌరవ ప్రతిష్ఠలకు భంగము కలుగునట్లు చెప్పబడు అపవాదము మొదలగు ఉండినవి.[1] మోషేకు విరోధముగా మిర్యాము మాటలాడిన సంఘటన, కొండెములు చెప్పుటకును కుష్ఠరోగమునకును గల సంబంధమునకు మూలమైయున్నది (సంఖ్యాకాండము 12:1–15). ఈ ప్రకారము వానికి కలిగిన కుష్ఠరోగము వాడు చేసిన పాపమునకు ఫలితమని యేసు పరిగణించును కాబట్టి ఆయన వానిని స్వస్థపరచడని బహుశా ఈ కుష్ఠరోగి తర్కించియుండవచ్చును.

**వచనము 3.** ఇతడు కుష్ఠ రోగముగలవాడై యున్నందునుబట్టి బహుశా ఇతరులెవరును చేయని కార్యామును యేసు చేసాడు: ఆయన చెయ్యి చాపి **వాని ముట్టెను**. ధర్మశాస్త్రము ప్రకారము ఒకడు కుష్ఠరోగిని ముట్టుకొనకూడదు లేక కుష్ఠరోగియైనా ఒకరిని ముట్టుకొనకూడదు, ఒకరినొకరు ముట్టుకొనుట నిషేధింపబడినది (లేవీయకాండము 5:3–6). కుష్ఠరోగిని తాకిన లేక ముట్టుకొనిన యూదుడు శుద్ధీకరణాచార ప్రకారము అపవిత్రుడు. మార్కు 1:41, యేసు హృదయమును బట్టబయలు చేయుచు, "ఆయన కనికరపడి" తన చెయ్యి చాపి వాని ముట్టెనని సెలవిచ్చుచున్నది.

**నాకిష్టమే, నీవు శుద్ధుడవు కమ్మని** యేసు వానికి ప్రత్యుత్తరమిచ్చాడు. వాడు తత్క్షణమే శుద్ధియాయెను; ఆలస్యమేమియు చేయకుండానే ఆనారోగ్యము వానిని విడిచిపెట్టినది. కుష్ఠరోగిని భౌతికముగా ముట్టుకొనుట వలన అది యేసును అపవిత్రము చేయుటకు బదులుగా, యేసు, తన దైవికమైన శక్తి చేత, కుష్ఠరోగినే స్వస్థపరచాడు. ఆయన వాని దేహమును సంపూర్ణముగా ఎప్పటివలెనే పునరుద్ధరించాడు, తద్వారా వాడు సమాజము లోనికి పునఃప్రవేశించి ఇతరుల వలెనే అందరితో కలిసి తిరుగుటకు యోగ్యుడయ్యాడు.

అద్భుతకరముగా కుష్ఠరోగులు స్వస్థపరచబడుట మెస్సీయ అరుదెంచాడని ముందుగానే తెలియజెప్పబడుచుండిన సూచనలలో ఒకటై యుండినది (11:2-6).

**వచనము 4.** యేసు కుష్ఠరోగిని స్వస్థపరచిన తరువాత, ఆయన వానికి రెండు ఆదేశముల నిచ్చాడు: ఒకటి, **ఎవరితోను ఏమియు చెప్పకుమని** ఆజ్ఞాపించాడు. యూదా ప్రజలలో అనవసరమైన ఉద్రేకము తలెత్తుటను నిరోధించుటకు కొన్నిపర్యాయములు యేసు ఈ ఆదేశమునిచ్చాడు, లేదంటే అట్టి పరిస్థితి ఆయన ఉపదేశములకు అంతరాయము కలిగించుచుండు ఒక ఆటంకమగుట మాత్రమేగాక అది రోమా ప్రభుత్వాధికారుల దృష్టినాకర్షించును (9:30; 12:16; 16:20; 17:9). ఈ అద్భుతకార్యము బహిరంగముగా చేయబడినందువలన, యేసు జారీ చేసిన ఆ ఆదేశము ఎలా ఆచరణలో పెట్టబడగలదని ఎవరైనా గాని ఆశ్చర్యపోవచ్చును. ఏదిఏమైనా, ఒక రహస్య ఏర్పాటులో, బహుశా ప్రజలందరు వారు స్వస్థలములకు ఎవరి దోవన వారు వెళ్లిపోయిన తరువాత జరిగినదని ఆ ఆదేశము సూచించుచుండవచ్చును. అంతమాత్రమే గాక, మార్కు మరియు లూకా వ్రాసిన క్రమమునకు భిన్నముగా నున్న అద్భుతముల సముదాయమును మత్తయి నివేదించుచున్నాడు గనుక, మత్తయి ఖచ్చితంగా ఒక చారిత్రిక కాల క్రమమును అవలంబించుచున్నాడని మనము ఆశించనవసరము లేదు.

రెండవది, యేసు, **నీవు వెళ్లి వారికి సాక్ష్యార్థమై నీ దేహమును యాజకునికి కనుపరచుకొని, మోషే నియమించిన కానుక సమర్పించుమని** వానితో చెప్పాడు. చర్మవ్యాధుల కలిగియుండిన వారిని పరీరక్షింపవలసిన బాధ్యత యాజకులపై యుండినది. గనుక ఈ కుష్ఠరోగి శుద్ధుడయ్యాడని ఒక యాజకుడు ప్రకటించవలెను. రాబర్ట్ హెచ్. మౌన్స్ చెప్పుచున్న దాని ప్రకారము, యాజకుల "ప్రజారోగ్య ధార్మిక పరిచారకులై" యుండిరి.[2] ఒక కుష్ఠరోగి శుద్ధుడయ్యాడని ఏ యే ప్రామాణికముల ఆధారంగా ప్రకటింపవలెనో, వాడు ఏ యే కానుకలు అర్పించుకొనవలెనో మొదలగు వివరములు ధర్మశాస్త్రము ప్రత్యేకముగా ప్రకటించినది (లేవీయకాండము 14:1-32). శుద్ధుడైన కుష్ఠరోగి సముచితమైన బల్యర్పణ లను సమర్పించుకొనుటకు వాడు యెరూషలేములో నున్న దేవాలయమునకు వెళ్లవలెను.

"వారికి సాక్ష్యార్థమై" అను పదజాలము యొక్క అర్థమునకు ఒక విచిత్రమైన విశేషత కలదు. ఈ పదజాలము యొక్క సందిగ్ధత వలన రెండు ప్రశ్నలు తలెత్తుచున్నవి. మొదటిది, "వారికి" అను సర్వనామము ఎవరిని సూచించుచున్నది? అది "యాజకులను" సూచింపవచ్చును, కానీ ఈ వచనములో "యాజకునికి" అని ఏక వచనములో వ్రాయబడి యున్నందునుబట్టి ఇది ప్రశ్నార్థకముగా మిగిలిపోవుచున్నది. "వారికి" అను మాట "జనసమూహములను" లేదా అత్యంత సర్వసాధారణంగా సూచించుచున్నట్లు "ప్రజలను" (8:1) సూచింపవచ్చును. రెండవది, "సాక్ష్యార్థమై" అను మాట దేనిని ప్రస్తావించుచున్నది? (1) బహుశా, శుద్ధినొందిన ఈ కుష్ఠరోగి వెళ్లి వారికి యేసు గూర్చి సాక్ష్యమిచ్చునని అర్థమై యుండవచ్చును. (2) వారు యేసునందు విశ్వసించనందుకు వారికి విరోధముగా వాడొక సాక్ష్యమై యుండెననునది మరొక సాధ్యతయై యున్నది. (3) వాడు వెళ్లి తగిన కానుక సమర్పించుకొనవలెనని ఆయన వానిని పంపుట. ప్రతి ఒక్కరు ధర్మశాస్త్రమునకు విధేయులై యుండవలెనను విషయమును యేసు ప్రచురము చేయుచుండెననుటకు ఒక సాక్ష్యమై యుండగలదు (మత్తయి 5:17-20 చూడు). ఏదిమైనా, యేసు వానిని స్వస్థపరచాడని

శుద్ధుడైన ఈ కుష్ఠరోగి "ఎవరితోను ఏమియు చెప్పకూడదు" కదా యను విషయము, ఈ మూడు సలహాల మూలమున మన యెదుట తలెత్తుచున్న ఒక సమస్యయై యున్నది. (4) యాజకుడు వానిని పరిశీలనగా పరీక్షించుట, ఆ తరువాత వాడు వెళ్లి తగిన కానుకను సమర్పించుకొనుట, ఈ కుష్ఠరోగి నిజముగా శుద్ధుడయ్యాడనియు, తత్ఫలితంగా వాడు మరొక పర్యాయము సమాజము లోనికి ప్రవేశించి స్వేచ్ఛగా జీవించవచ్చుననుటకు అది "జనసమూహములకు" లేక "ప్రజలకు" సాక్ష్యార్థమై యుండినదనునది నాలుగవ ఎంపికయై యున్నది. ఈ ప్రోద్బలమియ్యబడుచున్నదిగాను ఉన్నది (NEB; TEV; LB; NCV; CEV; JNT; NLT).

స్వస్థపరచబడిన కుష్ఠరోగి ప్రభువుకు అవిధేయుడై వాడు స్వస్థత నొందిన సమాచారమును విస్తారముగా ప్రచురము చేసాడని ఈ సంఘటన గూర్చి సమానాంతరముగా నున్న నివేదికలు మనకు సూచించుచున్నవి (మార్కు 1:45; లూకా 5:15). తత్ఫలితంగా చివరకు ఇది యేసు పరిచర్యను ఆటంకపరచి, ఆయన జనసంఖ్య ఎక్కువగా నున్న ప్రదేశముల నుండి తాత్కాలికముగా ఉపసంహరించుకొనునట్లు ఆయనను బలవంతము చేసినది.

## శతాధిపతి దాసుని స్వస్థపరచుట (8:5-13)

**5ఆయన కపెర్నహూములో ప్రవేశించినప్పుడు ఒక శతాధిపతి ఆయనయెద్దకు వచ్చి 6-ప్రభువా, నా దాసుడు పక్షవాయువుతో మిగుల బాధపడుచు ఇంటిలో పడియున్నాడని చెప్పి, ఆయనను వేడుకొనెను. 7-8యేసు-నేను వచ్చి వాని స్వస్థపరచెదనని అతనితో చెప్పగా ఆ శతాధిపతి-ప్రభువా, నీవు నా యింటిలోనికి వచ్చుటకు నేను పాత్రుడను కాను; నీవు మాటమాత్రము సెలవిమ్ము, అప్పుడు నా దాసుడు స్వస్థపరచబడును. 9నేను కూడ అధికారమునకు లోబడినవాడను; నా చేతిక్రింద సైనికులున్నారు; నేను ఒకని పొమ్మంటే పోవును, ఒకని రమ్మంటే వచ్చును, నా దాసుని ఈ పని చేయుమంటే చేయును అని యుత్తరమిచ్చెను. 10యేసు ఈ మాట విని ఆశ్చర్యపడి, వెంట వచ్చుచున్నవారిని చూచి-ఇశ్రాయేలులో నెవనికైనను నేనింత విశ్వాసమున్నట్టు చూడ లేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. 11అనేకులు తూర్పునుండియు పడమటనుండియు వచ్చి అబ్రాహాముతో కూడను, ఇస్సాకుతో కూడను, యాకోబుతో కూడను పరలోకరాజ్యమందు కూర్చుందురు గాని 12రాజ్య సంబంధులు వెలుపటి చీకటిలోనికి త్రోయబడుదురు; అక్కడ ఏడ్పును పండ్లు కొరకుటయు నుండునని మీతో చెప్పుచున్నాననెను. 13అంతట యేసు-ఇక వెళ్ళుము; నీవు విశ్వసించిన ప్రకారము నీకు అవునుగాకని శతాధిపతితో చెప్పెను. ఆ గడియలోనే అతని దాసుడు స్వస్థతనొందెను.**

**వచనము 5.** తరువాతి అద్భుతము **కపెర్నహూములో**, గలిలయ సముద్ర తీరమున ప్రగతి సాధించుచుండిన పట్టణములో జరిగినది. ఈ పట్టణము పేతురు స్వస్థలమై యుండినది (8:14) గనుక యేసు పరిచర్యకు అదొక ప్రధాన కేంద్రమయ్యింది (4:12-16; 9:1). 11:23లో, యేసు ఈ పట్టణముపై ఒక శాపవచనము ఉచ్చరించాడు. ఏలయనగా ఆయన ఆ పట్టణములో అనేక అద్భుతములు చేసినప్పటికిని ప్రజలు ఆయనయందు విశ్వాసముంచుటకు నిరాకరించారు. ఈ నాడు త్రవ్వకాలు చేయబడిన శిథిలాలలో ఒక

ప్రాచీన సమాజమందిరము మరియు కొన్ని ఇళ్లు కలవు, వీటిలో ఒకటి సాంప్రదాయము ప్రకారము పేతురు ఇల్లని చెప్పబడుచున్నది.[3]

ఈ సంఘటనలో, **యేసు** యొద్దకు వచ్చినవాడు అన్యుడును, రోమా ప్రభుత్వములో **శతాధిపతియునై** యుండెను. శతాధిపతులు ఉద్యోగరిత్యా సైనికులై యుండి, ఇతర సేనానుల వలె గాక, తోటి సైనికులతోపాటు రణరంగములో పాల్గొనుచుండిరి. వారు "రోమా ప్రభుత్వ వెన్నెముక" అని పిలువబడుచుండిరి. రోమా సైనికదళములో రోమా సామ్రాజ్యమందంతటను స్థావరములేర్పరచుకొనిన ఇరవై ఐదు పటాలములు (సుమారు 150,000 సైనికులు) ఉండినవి.[4] రోమా ప్రభుత్వ "పటాలము" మొత్తమంతటిలో ఆరు "శతకములు"గా విభాగింపబడినది, ప్రతి దానిలో ఒక శతాధిపతి అధీనములో నుండిన వంద మంది సైనికలుండిరి. ఈ నాయకుడు సైనికుల క్రమశిక్షణ, సిపాయిలను సైన్యములో చేర్చుకొనుట, మరియు జారీచేయబడు ఉత్తరువులు అమలుపరచబడుచున్నవని నిశ్చయపర్చుకొనుట మొదలగు విషయములకు బాధ్యుడై యుండెను.

నిర్దిష్టమైన ఈ శతాధిపతి కపెర్నహూములో ఉండుట సముచితమైన విషయమై యున్నది. దీని గూర్చి డేవిడ్ హిల్ ఇలా వివరించుచున్నాడు,

> హేరోదు అంతిపయ, గలిలయ మరియు పెరియకు చతుర్థాధిపతియై యుండినవాడు, ఆయన తన సొంత ప్రాంతములో నుండి చేర్చుకొనిన దండును సైన్యములో చేర్చుకొను హక్కు కలిగియుండెను. కపెర్నహూము సైనిక శిబిరములతో కూడిన పట్టణమై యుండినది గనుక అది శుల్కము వసూలు చేయబడుచుండిన ఒక ప్రధాన కేంద్రమై యుండినది, అందువలన అచ్చట సహజంగానే ఒక సైనికాధికారి నియమింపబడి యుండును (యోహాను 4.46తో పోల్చి చూడు).[5]

రోమా ప్రభుత్వ శతాధిపతులు అత్యంత ఔన్నత్యమైన నైతిక విలువలు మరియు ఘనమైన శీలము కలిగినవారై యుండవలెనని కోరబడినది మరియు సాధారణంగా వారు అట్టి లక్షణములుగలవారై యుండిరి. క్రొత్త నిబంధనలో పేర్కొనబడిన ప్రతి శతాధిపతి ఇట్టి వర్ణనకు తగినవారై యున్నాడు (27:54; అపొస్తలుల కార్యములు 10:1, 2, 22; 22:25, 26; 27:43) కొర్నేలీ గూర్చి పేర్కొనబడినట్లుగానే (అపొస్తలుల కార్యములు 10:2, 22). లూకా 7:3–5లో, ప్రస్తుత వాక్యభాగంలో పేర్కొనబడినవాడు, దైవభక్తిగల అన్యజనులలో ఒక్కడై యున్నట్లు అగుపించుచున్నది. అత్యధిక రోమా ప్రభుత్వ శతాధిపతుల వలె గాక, ఈయన యూదులు చేత అత్యున్నతముగా గౌరవింపబడుట, నిర్దిష్టమైన ఈ శతాధిపతి శీలము గూర్చిన ఒక సులక్షణమైయున్నది.

ఈ శతాధిపతి తన మనవిని కొందరు యూదీయ పెద్దల ద్వారా క్రీస్తు యొద్ద వినిపించాడని లూకా గ్రంథస్థం చేశాడు. వారు యేసు నొద్దకు వచ్చి, "నీ వలన ఈ మేలు పొందుటకు అతడు యోగ్యుడు; ఏలయనగా అతడు మన జనులను ప్రేమించి మనకు సమాజమందిరము తానే కట్టించెనని" ఆయనతో చెప్పి మిక్కిలి బతిమాలుకొనిరి (లూకా 7:4, 5) మత్తయి మరియు లూకా రచించిన వివరాలలో గల వ్యత్యాసమునకు సంబంధించినంతవరకు, లియోన్ మోర్రిస్ ఇలా వ్యాఖ్యానించుచున్నాడు, "ఒకడు ప్రతినిధుల ద్వారా చేయు విషయాన్ని, తానే చేయగలడని చెప్పుకొనవచ్చును. గనుక శతాధిపతి యేసుతో మాటలాడిన విషయము యొక్క సారాంశమును మనకు మత్తయి తెలియజెప్పుచుండగా,

లూకా ఈ సంఘటనల వరుస క్రమమును గూర్చిన మరిన్ని వివరాలు ఇచ్చుచున్నాడు."[6]

**వచనము 6**. శతాధిపతి యేసు నొద్దకు వచ్చి 6 మరియు 8 వచనములలో వ్రాయబడి యున్నట్లు, ఆయనను **ప్రభువా** (*kurios*) అని సంబోధించుచున్నాడు. ఈ పదము నానా విధములైన, ఉదాహరణకు మర్యాదపూర్వకముగా పలుకబడు సంబోధనా ఉక్తి ("అయ్యా") మొదలుకొని దైవికమైన ఒక బిరుదు ("దేవుడు") గూర్చిన అర్థముల నీయగలదు. ప్రస్తుత ప్రయోగములో అది కేవలము సౌజన్య పూర్వకముగా పలుకబడు పలుకును మించినదై యున్నది; ఆయన ఆధిపత్యమును ఆ శతాధిపతి గుర్తించాడని అది తెలియజెప్పుచున్నదై యుండగలదు. 8 మరియు 9 వచనములలో లిఖింపబడి యున్నట్లు, శతాధిపతి యొక్క వ్యాఖ్యానము ద్వారా ఇది సూచింపబడుచున్నది.

శతాధిపతి యొక్క శీలము అతడు తన **దాసుని** యెడల కనుపరచిన ఆందోళననుబట్టి మరి ఎక్కువగా ప్రదర్శింపబడుచున్నది. మత్తయి వ్రాసిన సువార్తలో వాడబడిన గ్రీకు పదము (*pais*) ఒక కుమారుడు లేదా ఒక బానిసను సూచించుచు, "ఒక పిల్లవాడు" అను అర్థమునిచ్చు పదమైయున్నది. ఏదిఏమైనా, లూకా 7:2 "బానిస" యను అర్థమునిచ్చు గ్రీకు పదమును (*doulos*) ప్రయోగించుచున్నది.[7] ఈ శతాధిపతి ఒక బానిస కొరకు, రోమీయులలో అనేకులు వానిని ఒక సొంత సొత్తుగా పరిగణించుచు హీనముగా ఎంచుచుండినవాని కొరకు ఎంతో ఆందోళన చెందుచున్నాడను వాస్తవము, ఆతడు కలిగియుండిన మంచి మనస్సునకు నిదర్శనముగా నిలుచుచున్నది.

శతాధిపతి దాసుడు **పక్షవాతముతో మిగుల బాధపడుచు, ఇంటిలో పడియుండెను**. వాని పక్షవాతమును గూర్చిన మరిన్ని వివరములు మరియు దానికి గల హేతువు మనకు తెలియజెప్పబడలేదు. "మిగుల బాధపడుచు" అను అర్థమిచ్చునదిగా అనువదింపబడిన గ్రీకు క్రియా పదము (*basanizō*), విపరీతముగా కలుగుచుండిన బాధను తెలియజేయుటకు అలంకార రూపములో వాడబడినది. NLTలో "నొప్పితో చిత్రహింస నొందుచుండెనని" వ్రాయబడి యున్నది. యేసు "వచ్చి తన దాసుని స్వస్థపరచవలెనని" ఆ శతాధిపతి యేసును మనవి చేసాడు (లూకా 7:3).

**వచనము 7. యేసు, నేను వచ్చి వాని స్వస్థపరచెదనని అతనితో చెప్పెను.** గ్రీకు వాక్య భాగములో, పురుషవాచక సర్వనామము "నేను" (*egō*) బాగా నొక్కివక్కాణింపబడిన తీరులో నున్నది. ఈ విశేషత NJBలో చూడనగును: "నాకై నేనే వచ్చి వానిని స్వస్థపరచుదును" (ఉద్ఘాటన రెట్టింపైనది). యేసు ఇచ్చిన ప్రత్యుత్తరమును కొందరు విద్వాంసులు ఒక ప్రశ్నగా వివరింతురు: "వానిని స్వస్థపరచుటకు నేను వెళ్లవలసి యున్నాదా?" అనగా, "[ఒక యూదుడనైన] నేను [అన్యుడైన ఒకని ఇంటిలోనికి] వెళ్లి వానిని స్వస్థపరచవలెనా?" అని మరొక మాటలో చెప్పుకొనవచ్చును. మత్తయి 15:21–28లో వ్రాయబడిన ప్రకారంగా, కనాను స్త్రీ కుమార్తెను, ఒక అన్యురాలి కుమార్తెను స్వస్థపరచుటలో యేసు కనుపరచిన సంశయము ఆధారంగా డగ్లస్ ఆర్ ఈ దృక్పథమును సమర్థించుచున్నాడు.[8] అయితే మౌన్స్ ఈ దృక్పథమును వ్యతిరేకించుచు, "యేసు అంతకు క్రితమే ఒక కుష్ఠరోగిని స్వయాన ముట్టి స్వస్థపరచాడు: గనుక ఒక అన్యుని ఇంటిలోనికి ప్రవేశించుటకు ఆయన ఎవ్విధముగానైనను సంకొచించడని" చెప్పుచున్నాడు.[9]

**వచనము 8.** అతని స్నేహితులు కొందరు అతని సందేశమును యేసుకు

తెలియజెప్పుటకు ఆయనకు ఎదురైనప్పుడు, ఆయన శతాధిపతి ఇంటిని సమీపించుచుండెనని లూకా సువార్తలో వ్రాయబడి యున్న నివేదిక మనకు తెలియజెప్పుచున్నది (లూకా 7:6, 7). **శతాధిపతి, ప్రభువా, నీవు నా యింటిలోనికి వచ్చుటకు నేను పాత్రుడను కానని యేసుతో చెప్పెను.** ఈ ప్రతిస్పందన శతాధిపతి ప్రదర్శించిన వినయమును చూపించుచున్నది, ఏలయనగా యేసు అతని ఇంటికి ఒక అతిథిగా వచ్చుటకు అతడు అయోగ్యుడని తనలో తాను నమ్మకముండినది. ఈ శతాధిపతి దేవునియందు భయభక్తులుగలవాడని స్పష్టమగుచున్నందునుబట్టియు, గనుక స్థానికంగా ఒక సమాజమందిరమును కట్టించాడు గనుకను, యూదులు అన్యజనుల ఇళ్లలోనికి వెళ్లకూడదను యూదీయ నిషేధము గూర్చి అతడు నిస్సందేహముగా ఎరిగియుండును (యోహాను 18:28; అపొస్తలుల కార్యములు 10:28 చూడు). ఇది బైబిలు శాసనము కంటే, దానికి బదులుగా ఒక సాంప్రదాయబద్ధమైన నియమమై యుండినది. "అన్యజనుల నివాసస్థలములు అపవిత్రములైనవని" ఘోషిస్తూ, మిష్నా ఈ నిషేధమును అమలుపర్చినది.[10] అలాగైతే, యేసును తన ఇంటి లోనికి ఆహ్వానించినట్లయితే, ఆయన తన ఇంటికి వచ్చుట ద్వారా యూదుల మనస్సులను నొప్పించడమా లేక రాకుండా ఒక రోగిని నిర్లక్ష్యము చేయడమా, ఈ రెండింటి మధ్య ఆయన నిర్ణయించుకొనునట్లు అతడు యేసును అడుగుచుండువాడై యుండునని ఆ శతాధిపతి ఎరిగియుండెను.

గనుక ఆహ్వానమును అందించుటకు బదులుగా, శతాధిపతి కేవలము ఆయన వచ్చి తన దాసుని స్వస్థపరచవలెనని యేసుని వేడుకొన్నాడు: **నీవు మాట మాత్రము సెలవిమ్ము, అప్పుడు నా దాసుడు స్వస్థపరచబడును**. యేసు తన ఇంటి లోనికి ప్రవేశించుటకు అతడు ఏమాత్రమును పాత్రుడు కాదని తాను నమ్మినప్పటికి, యేసు అతని దాసుని ముట్టనప్పటికిని, ఆయన దూరము నుండైనా కూడ తన దాసుని స్వస్థపరచగలడని నమ్ముటకు అతనికి యేసు నందు చాలినంత విశ్వాసముండినది.

**వచనము 9**. తన దాసుని స్వస్థపరచుటకు యేసు సమర్థుడని శతాధిపతి కలిగియుండిన విశ్వాసమునకు ఇచ్చుట యింకా ఎక్కువ సాక్ష్యమున్నది. అతడు **అధికారమనగా** నేమిటో అర్థంచేసికొన్నాడు. అతడు **అధికారము క్రింద** ఉండుట మాత్రమే గాక **అధికారములో** కూడ ఉన్నాడు. ఒక ప్రక్క తన దళములోను, పటాలములోను పై అధికారులై యుండినవారికి – చివరకు సామ్రాజ్య చక్రవర్తికి అతడు ఉత్తరవాదియై యుండెను. మరొక ప్రక్క అతని అధీనములో నుండిన **సైనికులకు** ఏదైనా చెప్పినప్పుడు, వారు ఆయనను ఎదురు ప్రశ్నించకుండానే లోబడవలసినవారై యుండిరి. అవిధేయులై యుండుట చక్రవర్తి యెడల రాజద్రోహమనియు, సామ్రాజ్యమునకు అవమానమనియు పరిగణింపబడినది. అతని సైనికులలో ఒకనికైనా లేక **బానిసలలో** ఒకనికైనా, ఉత్తరువులను జారీచేయుటకును (**ఒకని పొమ్మంటే పోవును, ఒకని రమ్మంటే వచ్చును ఈ పని చేయుమంటే చేయును**) పనులను చేయించుకొనుటకును శతాధిపతి అలవాటుపడిపోయి యుండెను. "ఇదే విధముగా, యేసు దేవుని నుండి అధికారము, వారు ఆయన చెప్పునది చేయునట్లు అదృశ్యులైన ఆత్మలకు (దూతలకు) ఆజ్ఞాపించుటకు ఆయనను అనుమతించు అధికారము పొందాడనియు" అతడు ధ్వనింపునిచ్చుచున్నాడు.[11]

**వచనము 10. యేసు** ఈ మాట విని **ఆశ్చర్యపడెను**. "ఆశ్చర్యపడుట" (*thaumazō*) అను

క్రియాపదము తరుచుగా యేసు చేయుచుండిన ఉపదేశములకును అద్భుతకార్యములకును జనసమూహములు వారి ప్రతిస్పందనగా కనుపరచుచుండిన ఆశ్చర్యమును వర్ణించుటకు ప్రయోగింపబడినది. ఏదిఏమైనా, యేసు వ్యక్తము చేసిన ఆశ్చర్యము సందర్భములో ఈ పదము కొన్ని పర్యాయములు మాత్రమే వాడబడినది, అది ఆయన యొక్క మానవీయతను సూచించుచున్నది. ఈ వాక్యభాగములోను దాని సమాంతరమైన వాక్య భాగములలోను, ఆయన శతాధిపతి విశ్వాసమును చూచి "ఆశ్చర్యపడెను" (లూకా 7:9). మార్కు 6:5బి ప్రకారము, యేసు తన సొంత పట్టణమైన నజరేతులో తృణీకరింపబడినప్పుడు, "ఆయన వారి అవిశ్వాసమునకు ఆశ్చర్యపడెను."

**ఇశ్రాయేలులో నెవనికైనను నేనింత విశ్వాసమున్నట్లు చూడలేదని** యేసు ఆయనతో కూడ ఉండిన యూదులతో చెప్పాడు. ప్రజలలో నుండిన "గొప్ప విశ్వాసము" గూర్చి యేసు రెండు పర్యాయములు మాత్రమే ప్రస్తావించాడు: ఈ సందర్భములో శతాధిపతి, మరియు మరొక సందర్భములో కనాను స్త్రీ (15:21-28). ఈ ఇరువురును అన్యజనులే! ఈ రెండు సంఘటనలలో ప్రతి ఒక్క దాని విషయములోను, ఇతర సందర్భముల వలె గాక, ఆయన దూరమున నుండి స్వస్థపరచాడు. మత్తయి వ్రాసిన సువార్తలో "విశ్వాసము" (*pistis*) అను పదము అగుపించుట ఇదే మొదటిసారి (8:10; 9:2, 22, 29; 15:28; 17:20; 21:21; 23:23). కొద్దిసేపటి తరువాతనే, వారి "అల్పవిశ్వాసమునుబట్టి" యేసు తన శిష్యులను తీవ్రముగా దండించాడు (8:26).

**వచనము 11. అనేకులు తూర్పు నుండియు పడమట నుండియు వచ్చుట** గూర్చి యేసు పలికిన ప్రవచనము భూమి మీద నున్న ప్రజలను సూచించినది. లూకా, "ఉత్తరము నుండియు దక్షిణము నుండియు" అను పదజాలమును కలుపుచున్నాడు (లూకా 13:29). ఈ దృష్టికోణము ఒకడు ఇశ్రాయేలు దేశము సరిహద్దులలో నివసించుటకు సంబంధించినదై యున్నది. ఇదే విధమైన భాష పాత నిబంధనలో, యూదులు చెరనుండి తిరిగి వచ్చుచుండిన సందర్భమును పురస్కరించుకొని ప్రయోగింపబడినది (కీర్తనలు 107:2, 3; యెషయా 43:5, 6; 49:8-13). ఏదిఏమైనా, ఇచ్చటి భాష ప్రధానంగా అన్యజనులకు వర్తించునదిగా ప్రయోగింపబడినది.

అనేకులు కూడుకొని **భోజనము చేయుదురని** యేసు సెలవిచ్చాడు. అందరు ఒక చోట కూడుకొని కలిసి భోజనము చేయుచుండినప్పుడు సోఫాల మీద జారబడి వెనకకు ఆనుకొని, కాళ్లను బల్లకు దూరముగా పారజూచుకొని కూర్చుండుట, నియమ ప్రకారమైన సందర్భములలో పాటించబడుచుండిన ఒక వాడుకయై యుండినది. వారు ఎడమ మోచేతి మీద అనుకొని, కుడి చేతితో తినుచుండిరి. ఈ భోజనపుబల్ల సహవాసమునకు సంబంధించి, ఎస్. స్కాట్ బార్ట్చి ఇలా వ్రాయుచున్నాడు, "భోజన సమయములు ఒకరు పోషకాహారమును ఆరగించు వ్యక్తిగత సందర్భములను మించినవై యుండినవి. మరొకరితో కలిసి భోజనము చేయవలెనను సదుద్దేశముతో బల్ల యొద్దకు ఆహ్వానింపబడుట స్నేహము, సన్నిహితము మరియు నమైక్యతకు గొప్ప సాంకేతిక చిహ్నముగా ఉంటూ అదొక ప్రత్యేకమైన పండుగయైనది."[12] ఇటువంటి సందర్భముల లక్షణము గొప్ప సంతోషమై యుండినదని వర్ణింపబడినది. ఇచ్చటి మనఃకల్పన యెషయా 25:6-9లో గల మెస్సీయ సంబంధిత ప్రవచనము నుండి తీసికొనబడినది, అచ్చట దేవుడు సకల జాతుల ప్రజలకు ఒక గొప్ప

విందును సిద్ధపర్చాడను వివరము వ్రాయబడియున్నది.

**అబ్రాహాము, ఇస్సాకు మరియు యాకోబుతో కూడ పరలోక రాజ్యమందు ఆరగింపబడు** ఈ విందును మనమేమని అర్థం చేసికొనవలెను? రెండు సాధ్యతలు పేర్కొనబడవచ్చును. మొదటిది, దేవుని రాజ్యములో, అనగా సంఘములో, అన్యజనులు కూడ కలిసియున్నారనుటకు ఇదొక ప్రస్తావనయై యుండును. బహుశా ఏ బేధమును చూపబడకుండా యూదులకును అన్యజనులకును అందజేయబడవలెనని దేవుడు ఉద్దేశించిన గొప్ప రక్షణ ప్రణాళికను యేసు శతాధిపతి చర్యలో గమనించియుండును (అపొస్తలుల కార్యములు 10 చూడు). విషయము ఇదైయున్నట్లయితే, “పరలోక రాజ్యమందు” అను పదజాలం సంఘమునకును, అనగా దానిని స్థాపించుటకు యేసు వచ్చిన సంఘమును గూర్చిన మరొక ప్రసావనయై యుండను.[13]

మరొక సాధ్యత ఏమనగా, తండ్రి యొక్క నిత్య రాజ్యములో పితురులతో కూడ అన్యజనులు ఒక్క చోట కలిసియుండుటను ఈ విందు సూచింపవచ్చును.[14] ఈ రెండవ దృక్పథము “రాజ్య కుమారులు వెలుపటి చీకటిలోనికి త్రోయబడు” తీర్పునకు సంబంధించి 12వ వచనములో గల ఉల్లేఖనము చేత సమర్థించబడుచున్నది.

ఈ రెండు దృక్పథములు సమీప సంబంధమును కలిగియున్నవి, ఏలయనగా ఈ రెండు కూడ నిత్య జీవము దిశగా వెళ్లుచున్నవి. యేసుక్రీస్తు మరలా వచ్చినప్పుడు, ఆయన వ్యవస్థాపించిన రాజ్యము (సంఘము) తండ్రి యొక్క నిత్య రాజ్యమౌతోంది (1 కొరింథీయులకు 15:24; 2 పేతురు 1:11; ప్రకటన 11:15). మొదటి దృక్పథము ఒకడు ఈ లోకములోని దేవుని రాజ్యములో భాగమైనప్పుడు ప్రవేశించు సహవాసమును నొక్కివక్కాణించుచున్నది, ఈ సహవాసము రాబోవు లోకములో ఇంత కంటే ఎక్కువ వైభవోపేతమైన సహవాసముగా ఒక పుట్టగొడుగు వలె పుట్టుకొచ్చు విషయము యున్నది. రెండవ దృక్పథము దాని దృష్టిని దాదాపు మొత్తంగా యూదులు మరియు అన్యజనులు కూడ ఏ భేదమైనను లేకుండా రానైయున్న లోకంలో అనుభవించు మహాదానందం మీద కేంద్రీకరించుచున్నది.

**వచనము 12**. పరలోక రాజ్యములో అన్యజనులు సహితము కలుపబడవలసి యుండగా, వారు ఎట్టి పరిస్థితులలోనైనను ఎప్పటికీ పరలోకరాజ్య పౌరులైయుందురని తమ్మును గూర్చి తామే అభయము కలిగియుండిరి అనేకులు దానిలో నుండి వెలుపలికి త్రోయబడుదురు. **రాజ్య కుమారులు** యేసు మెస్సీయగా అంగీకరించని యూదులై యుండిరి. వారు అబ్రాహాము, అనగా దేవుడు వాగ్దానములను మొదట ఇచ్చిన వాని సంతానమై యుండిరి (ఆదికాండము 12:1–3), కానీ వారు అబ్రాహాము యొక్క విశ్వాసమును పోలి నడుచుకొనలేదు (3:8, 9పై గల వ్యాఖ్యానమును చూడు). అటుతరువాత, “దేవుని రాజ్యము మీ యొద్ద నుండి తొలగింపబడి, దాని ఫలమిచ్చు జనులకియ్యబడునని” యేసు కొందరు యూదులతో చెప్పాడు (21:43).

విశ్వాసముంచని యూదులు **వెలుపటి చీకటిలోనికి త్రోయబడుదురు; అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు నుండునని** యేసుసెలవిచ్చెను. ఈ వర్ణన క్రొత్త నిబంధనలో నరకమును గూర్చి తెలియజెప్పబడిన ప్రస్తావనల వంటిదే అయియున్నది (లూకా 13:28; 2 పేతురు 2:17; యూదా 13). జాక్ పి. లూయిస్ ఇలా వ్రాయుచున్నాడు,

> *వెలుపటి చీకటి* అను పదజాలము, దుర్మార్గుల శ్రమను సూచించునదిగా గల వర్ణన, మత్తయి వ్రాసిన సువార్తలో అది విశిష్టమైనదై యున్నది (22:13; 25:30), కానీ పరిశుద్ధ లేఖనములను పోలి యుండు అప్రామాణిక గ్రంథములలో సంబంధిత మనోసంకల్పము ఆశింపబడినది. ... ఏడ్పు మరియు పండ్లు కొరుకుట, మత్తయి వ్రాసిన సువార్తలో ఆరు పర్యాయములు అగుపించును (8:12; 13:42, 50; 22:13; 24:51; 25:30; లూకా 13:28తో), ఇది నీతిమంతుని సౌభాగ్య సమృద్ధి యెడల దుర్మార్గుడు ప్రదర్శించు ప్రతిస్పందనను వర్ణించుటకు ఇంతకు మునుపు కీర్తనలు 112:10లో అగుపించుచున్నది.[15]

అబ్రాహామునకు శారీరక సంతానమై యుండుట వలన ఒకనికి రాజ్యములో చోటుండునని ఎటువంటి హామీ ఇవ్వబడలేదు, సరికదా అది ఒకడు తన ఆత్మను పోగొట్టుకొనుటను కూడ నిరోధించలేదు. ఏదిఏమైనా, ఒకడు యేసును మెస్సీయాగా గుర్తించునట్లు వానిని సిద్ధపరచుచునే వాని సువర్ణావకాశము దాటిపోవునట్లు చేయు సానుకూలములన్నిటిని వాడు కలిగియుండవచ్చును, అయితే ప్రతికూలములుగలవాడు పైకి లేచి రాజ్యములో ప్రవేశించును.

**వచనము 13.** ఆయనను వెంబడించుచుండినవారితో మాటలాడిన తరువాత, యేసు శతాధిపతి యొద్ద నుండి వచ్చిన వార్తాహరుల వైపు తిరిగి ఈ సందేశమును పంపించాడు: **ఇక వెళ్లుము; నీవు విశ్వసించిన ప్రకారము నీకు అవునుగాక.** స్వస్థత చేకూర్చబడిన ప్రతి సందర్భములో, స్వస్థతనొందిన వ్యక్తి గాని లేదా అనారోగ్యస్థుని పక్షమున యేసును సహాయము అర్థించిన వారు గాని, యేసు క్రీస్తునందు విశ్వాసముంచవలసిన అవసరం లేకుండినది. ఏదిఏమైనా, యేసు దూరము నుండైనా తన దాసుని స్వస్థపరచగలడని శతాధిపతి తన సంపూర్ణ విశ్వాసమును ప్రదర్శించినందునుబట్టి, అతని విశ్వాసము గౌరవింపబడినది: **ఆ గడియలోనే ఆతని దాసుడు స్వస్థతనొందెను.** ఆ దాసుడు “అదే గంటకు” స్వస్థతనొందెనని గ్రీకు వాక్యభాగము అక్షరాలా సెలవిచ్చుచున్నది (యోహాను 4:53 చూడు). “పంపబడినవారు ఇంటికి తిరిగి వచ్చి, ఆ దాసుడు స్వస్థుడై యుండుట కనుగొనిరి” అని లూకా వ్రాయుచున్నాడు (లూకా 7:10).

## పేతురు అత్తను స్వస్థపరచుట (8:14, 15)

**14తరువాత యేసు పేతురింటిలో ప్రవేశించి, జ్వరముతో పడియున్న అతని అత్తను చూచి 15ఆమె చెయ్యిముట్టగా జ్వరమామెను విడిచెను; అంతట ఆమె లేచి ఆయనకు ఉపచారము చేయసాగెను.**

**వచనము 14.** ఈ స్వస్థత **పేతురు ఇంటిలో** జరిగినది. సీమోను పేతురు, గలిలయ సముద్రములో చేపలుపట్టు జాలరి, శిష్యుడుగా నుండుటకు **యేసు** చేత పిలువబడినవాడు, అటుతరువాత ఒక అపొస్తలుడుగా నియామకము చేయబడినాడు (4:18–20; 10:1, 2పై గల వ్యాఖ్యానము చూడు). పేతురు మరియు అతని సహోదరుడు అంద్రెయ యొక్క స్వస్థలము బేత్సయిదా (యోహాను 1:44), కానీ వారు తమ స్థిర నివాసమేర్పరచుకొనుటకు కపెర్నహూమునకు వచ్చారు. మార్కు వ్రాసిన సువార్తలో, “సీమోను అంద్రెయ అను వారి యింట” అని వ్రాయబడియున్నది (మార్కు 1:29). అనేక తరములు, అనగా, విస్తృతముగా

విస్తరించిన కుటుంబములవారు తరచుగా ఒకే ఇంటిలో నివసించారు. అంద్రెయ (మరియు అతని సతీమణి?) తన ఇంటిని పేతురు మరియు అతని భార్యతో పంచుకొన్నాడని స్పష్టమగుచున్నది (1 కొరింథీయులకు 9:5 చూడు). మరి ఎక్కువ సంభావ్యముగా, పేతురు **అత్తగారు** కూడ వారితో నివసించినది. దీనికి తోడుగా, యేసు నజరేతు పట్టణమును విడిచిపెట్టి వెళ్లిన తరువాత పేతురు ఇంటిని యేసు తన పరిచర్యకు ప్రధాన కేంద్రంగా చేసికొన్నట్లు అగుపించుచున్నది (4:13; మార్కు 1:35; 2:1).

యేసు ఇంటిలోనికి ప్రవేశించినప్పుడు, పేతురు అత్త **జ్వరముతో మంచము మీద పడియుండెను.** పేర్లు పేర్కొనబడినవారు ("వారు" అని ప్రస్తావింపబడినవారు) ఆమెను గూర్చి యేసుకు సమాచారము నందించారని మార్కు మరియు లూకా, ఇరువురును సూచించుచున్నారు. ఏదిఏమైనా, "వారు" అను మాట పేతురు, అంద్రెయ, యాకోబు, మరియు యోహానును సూచింపవచ్చును (మార్కు 1:29, 30). ఆమె "తీవ్రమైన" జ్వరముతో బాధపడుచుండెను (లూకా 4:38). ఆమె బాధపడుచుండిన అనారోగ్య లక్షణములు ఈ వాక్యభాగ్యములో పేర్కొనబడలేదు, అట్లయినను ఆ రోజుల్లో, అది మామూలు జ్వరమే అయిన అదొక సామాన్యమైన రోగలక్షణము కాదు గాని ఒక పెద్ద రోగముగా పరిగణింపబడి యుండును (యోహాను 4:52; అపొస్తలులు కార్యములు 28:8 చూడు). ఆమె పడకలో నుండి లేచి, వచ్చిన అతిథులకు ఉపచారము చేయలేకపోవుట ఆమె బాధపడుచుండిన అనారోగ్య పరిస్థితి తీవ్రమైనదిగా ఉండినదని సూచించుచున్నది.

**వచనము 15.** జ్వరముతో బాధపడుచుండిన ఆమె **చెయ్యిని** యేసు **ముట్టుకొన్నాడు** – ఇది యూదీయ సాంప్రదాయము ప్రకారము నిషేధింపబడిన చర్య[16] – వెంటనే **జ్వరము** ఆమెను విడిచెను. అంతట **ఆమె లేచి ఆయనకు ఉపచారము చేయసాగెను.** ఆమె ఇతరులకు కూడ ఉపచారము చేసినప్పటికిని, ఆమెను స్వస్థపరచిన తరువాత నిస్సంశయముగా ఆమె యేసు యెడల ప్రత్యేక శ్రద్ధ చూపించి యుండును.

## యేసు చేసిన స్వస్థత గూర్చిన సారాంశము (8:16, 17)

**16సాయంకాలమైనప్పుడు జనులు దయ్యములు పట్టిన అనేకులను ఆయనయొద్దకు తీసికొని వచ్చిరి. ఆయన మాటవలన దయ్యములను వెళ్ళగొట్టి రోగులనెల్లను స్వస్థపరచెను. 17అందువలన–ఆయనే మన బలహీనతలను వహించుకొని మన రోగములను భరించెనని ప్రవక్తయైన యెషయాద్వార చెప్పబడినది నెరవేరెను.**

**వచనము 16.** యేసు కపెర్నహూమునకు వెళ్లినప్పుడు, "వెంటనే" ఆయన సమాజమందిరములోనికి ప్రవేశించాడు (మార్కు 1:21; లూకా 4:31, 33). సమాజమందిరములో ఉన్నప్పుడు దయ్యములు పట్టిన ఒకడు ఆయనకు ఎదురుపడ్డాడు. దయ్యముల విషయములో ఇచ్చట గల బహు వచనము, సర్వనామముల ద్వారా సూచింపబడుచున్నది. "ఊరకుండుము, వానిని విడచిపొమ్మని!" (మార్కు 1:25 చూడు) పలుకుచు, యేసు ఆ దయ్యములను గద్దించాడు (మార్కు 1:28; లూకా 4:37 చూడు).

సబ్బాతు దినము ముగియక మునుపు అనారోగ్యముగా నుండిన వారిని యేసు నొద్దకు తీసికొనివచ్చుటకు యూదులలో అనేకులు భయపడుచుండిరి. కొందరు

రోగులను మోసకొనిపోబడవలసి యుండినదనుటలో సందేహము లేదు. మరియు వారి ప్రియులైన రోగులు స్వస్థపరచబడునట్లు వారిని సబ్బాతు దినమున తీ(మో)సికొనివచ్చుట చట్టవిరుద్ధమైనదని కొందరు యూదీయ నాయకులు ఘోషించి యుండుట సంభావ్యమైన సంగతై యున్నది (యోహాను 5:10 చూడు).[17] కాబట్టి, జనులు యేసు నొద్దకు వచ్చునట్లు సూర్యుడస్తమించు వరకు వేచియుండిరి (మార్కు 1:32; లూకా 4:40). సూర్యస్తమయము మొదలుకొని మరుసటి సూర్యాస్తమయము వరకు ఒక దినమని యూదులు లెక్కించారు (ఆదికాండము 1:5, 8, 13, 19, 23, 31). **సాయంకాలము ప్రొద్దు గ్రుంకినప్పుడు,** సబ్బాతు దినము ముగిసింది, గనుక వారములోని మొదటిదినము మొదలయ్యిందని లెక్కింపబడింది.

ఆయన ఇదివరకు అనేక పర్యాయములు చేసినట్లే – అటుతరువాత కూడ అలాగే చేసాడు – వారి విశ్వాసము యొక్క స్థాయితో లేదా వారికుండిన నిర్దిష్టమైన వ్యాధితో నిమిత్తము లేకుండానే యేసు రోగులనందరిని **స్వస్థపరచాడు**. ఏదిఏమైనా, **దయ్యములు పట్టినవారికిని రోగులకును** మధ్య మత్తయి వ్రాసిన సువార్తలో ఒక తేడా చూపింపబడుచున్నది (4:23, 24 చూడు). **ఆయన మాటవలన దయ్యములను వెళ్లగొట్టెనను** వాస్తవము ద్వారా యేసు కలిగియుండిన శక్తి నిరూపింపబడుచున్నది. దీనికి తారతమ్యముగా, ప్రాచీన కాలము నాటి భూతవైద్యులు మంత్రోచ్చారణ చేత, ఉన్నతమైన ఆత్మలను ఆమంత్రణము చేయుట ద్వారా, మరియు కుళ్లు కంపుకొట్టు చేపల కడుపు లోపలి భాగములను లేక దుర్వాసన వచ్చు వేళ్లను కాల్చుట ద్వారా దయ్యములను వెళ్ళగొట్టుటకు ప్రయత్నించారు.[18] గ్రహాం హెచ్. ట్వెల్ఫ్ట్రీ ప్రకారము, అనేకమైన ఇతర వస్తువులు సహితము ఉపయోగింపబడినవి:

> బబులోను టాల్ముడ్‌లో పేర్కొనబడిన తాయెత్తులో, తాటి చెట్టు ముల్లు, కఱ్ఱ ముక్కలు, బూడిద, కీలు, జీలకఱ్ఱ, కుక్క వెంట్రుకలు మరియు దారము వాడబడినవి; ఇనుప రింగులు వాడబడినవని లూసియన్ చెప్పుచున్నాడు మరియు భూతవైద్యులు తాయెత్తులను, ఒలీవ కొమ్మలను, తీయని వాసన కలిగిన ఒక రకమైన మూలికలను మరియు ప్రతేక శబ్దములను ఉపయోగించుచుండిరని మంత్రములు కలిగియుండిన పురాతన పత్రములు (Magical papri) చెప్పుచున్నవి.[19]

**వచనము 17.** యేసు చేకూర్చుచు చేయుచుండిన స్వస్థత పరిచర్య **ప్రవక్తయైన యెషయా** పలికిన ప్రవచన పలుకుల **నెరవేర్పైయున్నదని** మత్తయి అర్థంచేసికొన్నాడు: **ఆయనే మన బలహీనతలను వహించుకొని మన రోగములను భరించెను.** మత్తయి యొక్క ఉల్లేఖనము, ఒక సమానార్థక సమాంతరమునై యున్నది, యెషయా 53:4 నుండి తీసికొనబడినది, దీనిని, "నిశ్చయముగా ఆయనే మన వ్యసనములను వహించెను, మరియు మన దుఃఖములను సహించెను" అని NASB అనువదించుచున్నది. "యెషయా గ్రంథంలో రోగములు అనియు, మత్తయి వ్రాసిన సువార్తలో *బలహీనతలు* అనియు అనువదింపబడి యున్న పదము, హెబ్రీ మరియు గ్రీకు భాషల్లో, *శరీర రోగములు* అని సరైన అర్థము నిచ్చుచున్నది. ... ఈ రోగములను భరించుట అనగా వాటిని దూరముగా తొలగించుట యని స్పష్టముగా తెలియుచున్నదని"[20] ఆల్బర్ట్ బార్న్స్ తర్కించుచున్నాడు. "ఆయన చేకూర్చుచుండిన స్వస్థతలలో, యెషయా వర్ణించిన 'ప్రభువు సేవకుడు'గా ఆయన నిర్వర్తించవలసి యుండిన పాత్రలలో యేసు ఒక భాగమును సక్రమముగా

నిర్వర్తించుచుండెనని" లూయిస్ రచించాడు.[21]

యెషయా గ్రంథంలోని ఉల్లేఖనము బహుశా యేసు సిలువ మీద పాపముపై సాధించిన అంతిమ విజయమును సూచించవచ్చును. ఎంతైనా, యెషయా 53వ అధ్యాయం యొక్క సందర్భము మెస్సీయ చేయనై యుండిన పాపప్రాయశ్చిత్తము గూర్చిన ఒక భావి కథనమై యున్నది కదా. "యేసు చేసిన స్వస్థత అద్భుతకార్యములు కేవలములు అధికారముతో కూడినవై యుండలేదు, కానీ అవి సంభవింపనై యుండిన యేసు యొక్క పాపప్రాయశ్చితార్థ మరణమునకు సంబంధించిన ఒక కార్యముగా చేయబడినవని మత్తయి గ్రహించుచున్నాడని" డి. ఏ. కార్సన్ వ్రాయుచున్నాడు.[22] "రోగమునకు అంతిమ సమాధానము సిలువలో నున్నదను ఆలోచన నిశ్చయముగా ఇమిడియున్నదని" మోర్రిస్ గుర్తించాడు.[23] జాన్ ఫిలిప్స్ తన గమనికను ఇలా వివరించుచున్నాడు:

> రోగమునకు గల హేతువుతో యేసు సిలువపై వ్యవహరించిన విధానము గూర్చి మాటలాడునప్పుడు మనము జాగ్రత్తపరులమై యుండవలెను. పాపప్రాయశ్చిత్తములో మనకు తత్క్షణ శారీరక స్వస్థత కలిగినదని దాని అర్థము కాదు. ఈ బోధను ప్రబోధించువారు పొరపాటు చేయుచున్నారు. ఈ రోజులో స్వస్థత ఎల్లప్పుడు అందుబాటులో ఉన్నదనియు, స్వస్థపడని వారిలో స్వస్థతను పొందుటకు అవసరమై యున్న విశ్వాసము కొరతయై యున్నదనియు ఉపదేశించుట వలన భారీ మానసిక వేదనను కలిగించుటకు కూడ వారు బాధ్యులై యున్నారు. మరణ మినహాయింపు మనకు హామీ ఇవ్వబడిన హక్కు కాదు, సరికదా భౌతిక స్వస్థత కూడా అంతే. చిట్టచివరకు రుగ్మత నుండి విడుదల మరియు మరణము మీద విజయము [ప్రకటన 21:4] మనకు సిలువ ద్వారానే లభించును – కానీ అది "మహిమ దేహము యొక్క విమోచనము" అని పౌలు పిలుచుచున్న దాని కొరకు (రోమీయులకు 8:22, 23) కనిపెట్టుచున్నది.[24]

ప్రజల *ఆధ్యాత్మిక* అవసరములను తీర్చుట ఈ లోకములో క్రీస్తు చేయవలసిన యుండిన బృహత్కార్యమై యుండినది; కానీ ఆయన చేసిన అద్భుతకార్యములు, ముఖ్యంగా స్వస్థతలు, మనము పాప(రోగ)ము నుండి సంపూర్ణముగా స్వస్థపరచబడవలసిన మన అవసరత ఎంత లోతైనదై యున్నదో, మరియు మనలను సంపూర్ణముగా స్వస్థపరచుటకు ఆయన శక్తి ఎంత గంబీరమైనదై యున్నదో చక్కగా చిత్రీకరించుచున్నవి. "అవి దేవుని హృదయమునకు సంబంధించిన ఒక ఆశ్చర్యకరమైన ప్రత్యక్షతను మనకిచ్చుచున్నవి"[25] మరియు దేవుడు తన ప్రజల యెడల కలిగియున్న అతులితమైన ప్రేమను మనకు గుర్తుచేయుచున్నవి.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### అద్భుతములు (అధ్యాయము 8)

"అద్భుతము," "ప్రకృతి ధర్మముల చేత సమాధానము చెప్పుటకు సాధ్యముకాని సంఘటనయై యున్నది గనుక అది దాని మూలములో ప్రకృతి బాహ్యామైనదై యున్నది లేక దేవుని కార్యమై యున్నదని పరిగణింపబడుచున్నది."[26] "అద్భుతము," "ప్రకృతి బాహ్యామైన శక్తి వలన ప్రకృతికే కలుగుచున్న ఒక అంతరాయమై యున్నదని" సి. ఎస్. లూయిస్ గుర్తించాడు.[27] ఇంకా ఎక్కువ సంపూర్ణమైన నిర్వచనము *ది వెస్ట్‌మిన్‌స్టర్ బైబిల్ డిక్షనెరీలో*

ఈ విధముగా నున్నది:

> అత్యంత సంక్షిప్తముగా నున్న బైబిల్ అవగాహన ప్రకారము, అద్భుతములు బాహ్య ప్రపంచంలో సంభవించుచున్న సంఘటనలై యున్నవి. అవి దేవుని అవశ్యక శక్తి చేత చేయబడుచు, ఒక సూచనయై లేక ఆమోద ముద్రయై యుండుటకు ఉద్దేశింపబడినవై యున్నవి. దేవుడు వాటికి ఆధారమై ఆదుకొనుచు, వాటిని తన అధీనములో ఉంచుకొనుచు, సమస్త విషయములకు మార్గనిర్దేశనము నిచ్చుచున్నాడు గనుక అవి సంభవించుటకు సాధ్యమగుచున్నది, మరియు అది వ్యక్తిగతమైనదై యుండి సర్వశక్తివంతమైనదై యున్నది.[28]

బైబిలు సంబంధమైన నివేదికలలో, దేవుడు ప్రకృతి ధర్మములను అప్పుడప్పుడు ప్రక్కనబెట్టి, తన దైవికమైన శక్తి చేత, వాటికి ఆవల నున్న కార్యములను చేసాడు. బైబిలు సంబంధమైన అద్భుతములు ఆగిపోయినందు వలన (1 కొరింథీయులకు 13:8-10 చూడు), ఇటువంటి అద్భుతములను ఈ రోజుల్లో కూడ చేయుచున్నారని సాధికారంతో చెప్పుకొనువారు ఇతరులను మోసము చేయుచు తామే మోసపోవుచున్నారు.

మొదటి శతాబ్దములో అపొస్తలులు మరియు ఇతరుల ద్వారా చేయబడిన అద్భుత కార్యాములు వారు ఉపదేశించుచుండిన సందేశము దృఢపర్చబడవలెనను ఉద్దేశముతో అనుమతింపబడినవి (మార్కు 16:17-20; హెబ్రీయులకు 2:2-4). పరిశుద్ధ బైబిల్, దేవుని వాక్యమైయున్నదని ప్రజలను ఒప్పించుటకు ఈ రోజుల్లో కూడ అద్భుతములు అవసరమై యున్నవని కొందరు ఈనాడు పట్టుబట్టుచున్నారు. రక్షణానందానుభవమును కలుగజేయు విశ్వాసమును పుట్టించుటకు బైబిల్‌లో గ్రంథస్థంచేయబడిన అద్భుతములే చాలునని (యెహాను 20:30, 31). దేవుని వాక్యమును వినుట వలన విశ్వాసము కలుగును (రోమీయులకు 10:17), అంతేగాని అద్భుతములమను చూచుట ద్వారా కాదు. యేసు క్రీస్తు చేసిన అద్భుతములను కళ్లారా చూచినవారిలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచలేదు (12:22-24). దేవుడు నేడు సహితము అద్భుతకార్యాములను చేయుచున్నాడు, కానీ ఆయన తన దైవికమైన సమకూర్పు చేత ఆయన సృజించిన సృష్టి క్రమము ద్వారా చేయుచున్నాడు.

## కుష్ఠ రోగము (8:1-4)

అత్యంత సంభావ్యముగా, బైబిల్ కాలములో అనేక వ్యాధులు కుష్ఠు వ్యాధి సముదాయమునకు చేర్చబడినవి. కుష్ఠు వ్యాధిగా అగుపించుచుండిన ప్రతి పరిస్థితి వాస్తవముగా కుష్ఠువ్యాధియై యుండలేదు. చర్మవ్యాధి కలిగియుండిన ఒకని రోగము యాజకుని చేత నిర్ధారణ చేయబడిన ప్రక్రియ లేవీయకాండము 14:1-32లో సంక్షేపముగా వర్ణింపబడి యున్నది. ఆ కాలములో కుష్ఠు వ్యాధిని సంపూర్ణముగా నయము చేయు ఔషధములు లేకుండినందు వలన, ఒకడు శుద్ధి అయ్యాడంటే, వాడు దేవుని కృపచేతనే శుద్ధిచేయబడెనని అర్థము (2 రాజులు 5:1-19; లూకా 4:27). ఒకడు శుద్ధియైన తదుపరి, స్వస్థత నొందిన వాడు సమాజములోనికి పునఃప్రవేశించుటకు అనుమతింపబడక మునుపు, దానికొక నిర్దిష్టమైన ప్రక్రియ ఉండినది. స్వస్థతలు అరుదుగా సంభవించుచుండినవి (సంఖ్యాకాండము 12:13-15; 2 రాజులు 5:9-14). కొన్ని పర్యాయిములు కుష్ఠువ్యాధి దేవుడు కలుగజేసుకొనిన ప్రత్యక్ష చర్యకు ఫలితమై యుండినది (సంఖ్యాకాండము 12:9-15).

ధర్మశాస్త్రము ప్రకారము కుష్ఠువ్యాధిగలవారు ఒక విధముగా కృప క్రింద ఉండిన పాపులై యుండిరి. కుష్ఠరోగము ఒకనిని సమాజము నుండి వేరుచేసినట్లే, పాపము ఒకనిని దేవుని నుండియు తన ప్రజల నుండియు వేరుచేయును (యెషయా 59:1, 2). పాప ఫలితముగా కలిగిన వేర్పాటు తాత్కాలికమైనదై లేదా శాశ్వతమైనదై యుండగలదు (2 థెస్సలొనీకయులకు 1:6-10). ఈ వేర్పాటు ఏమైయున్నదో, దాని అర్థమేమిటో ప్రజలు ఇప్పుడు అర్థంచేసికొనకపోవచ్చును, కానీ తీర్పు తదుపరి వారు తెలిసికొందురు (25:41, 46). పాపరోగమను వ్యాధికి చికిత్స కలదు. అది పాపి ఆత్మకు పూయబడు క్రీస్తు రక్తమై యున్నది (ఎఫెసీయులకు 1:7; కొలొస్సయులకు 1:19-20; ప్రకటన 1:6).

### ఆశ్చర్యజనకమైన విశ్వాసము (8:5-13)

ఈ కథలోని రోమా ప్రభుత్వ శతాధిపతి అనేక ఘనమైన గుణలక్షణములను ప్రదర్శించాడు. (1) అధికారము మరియు ప్రభావితము చేయశక్తిగలవాడుగా, అతడు కపెర్నహూములోని ప్రజలలో అనేకుల చేత నిస్సందేహముగా ఘనమైనవాడని ఎంచబడినాడు. (2) అతడు పలుకుబడిగలవాడై యుండినప్పటికిని, వినయముగలవాడై యుండెను. "ప్రభువా, నీవు నా యింటిలోనికి వచ్చుటకు నేను పాత్రుడను కానని" యేసుతో చెప్పాడు (8:8). (3) ఈ శతాధిపతి దేశాధిపతి దేశభక్తిగల యూదా దేశ ప్రేమికుడై యుండెను (లూకా 7:5). అతడు అన్యమతారాధన పద్ధతి ప్రకారము పెంచబడినట్లగుపించుచున్నప్పటికిని, చివరకు "దేవునికి భయపడువాడుగా" తయారయ్యాడని స్పష్టమగుచున్నది. (4) అతడు ఉదారస్వభావముగలవాడై యుండెను. స్థానికంగా ఆయన కపెర్నహూములో కట్టించిన సమాజమందిరమునుబట్టి యూదీయ పెద్దలు ఆయనను ప్రశంసించారు (లూకా 7:5). తక్కువలో, తక్కువగా, ఆయన బహుశా ఈ పథకమునకు డబ్బులిచ్చియుండును. (5) ఘనమైన ఈ గుణలక్షణములన్నిటిని మించి, ఆయన గొప్ప విశ్వాసముగలవాడై యుండెను. అతని దాసుడు బాగుపడునట్లు దూరము నుండే, "మాట మాత్రము సెలవిమ్మని" అతడు యేసును విన్నవించుకొన్నాడు (8:8). శతాధిపతి విషయమై యేసు "ఆశ్చర్యపడి" మరియు "ఇశ్రాయేలులో నెవనికైనను నేనింత విశ్వాసమున్నట్టు చూడలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను" (8:10) ఈ లెక్కచొప్పున, ఈనాడు యేసు మన విశ్వాసం గూర్చి ఏమని చెప్పగలడు?

డేవిడ్ స్టూవర్ట్

### ఉపచారము చేయుటకు రక్షింపబడితిమి (8:14, 15)

పేతురు అత్త స్వస్థపరచబడినందువలన ఆమె వెంటనే పడకలో నుండి లేచి యేసునకును ఆ ఇంటిలో కూడుకొని యుండిన ఇతరులకును ఉపచారము చేయసాగినది (లూకా 4:39 చూడు). ప్రభువైన యేసు తాకిడి ఆమె జీవితంలో ఎంతో గొప్ప మేలు కలిగించినది. క్రీస్తు చేత మనము పొందు ఆధ్యాత్మిక స్వస్థత మనము ఇటువంటి మంచి పనులు చేయునట్లు మనకు దోహదపడవలెను; మనము ఉపచారము చేయుటకు రక్షింపబడియున్నాము. మనము కృప చేతనే రక్షింపబడితిమని ఉద్ఘాటించి పలికిన పిదప పౌలు, "వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన

సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియై యున్నామని” ముగింపు మాటలు పలికాడు (ఎఫెసీయులకు 2:10).

డేవిడ్ స్టూవర్ట్

**వ్యాధికి గల మూల కారణము (8:16, 17)**

రోగులను స్వస్థపరచుట, “దేవుని పరిచారకుడుగా” యేసు చేయుచుండిన పరిచర్యలో ఒక భాగమై యుండినది (యెషయా 53:4), అయితే ఆయన ఈ లోకములోనికి వచ్చిన హేతువుకు అదే అంతిమ చరణము కాదు. హేగ్నర్ ఇలా వివరించుచున్నాడు, “రోగము ఓడించబడవలసిన అసలైన శత్రువు కాదు: ఆ శత్రువు పాపమై యున్నది, ఏలయనగా పతనమైన ప్రపంచము చేత కలిగిన పాపము చివరకు ఈ యుగములో ప్రజలెదుర్కొనుచున్న శ్రమ మరియు వెనుక హేతువుగా దాగియున్నది.”[29] యేసు సిలువ మీద మరణించినప్పుడు, మనము చేసిన పాపములు క్షమింపబడునట్లు ఆయన తన రక్తమును కుమ్మరించాడు (26:28). నీటి బాప్తిస్మము ద్వారా రక్షించు రక్తము చేత తాకబడి (అపొస్తలులకార్యాములు 2:38; రోమీయులకు 6:3, 4; ప్రకటన 7:14), దాని చేత నిరంతరము కడుగబడుచుండు మనము (1 యోహాను 1:9) చివరకు అక్షయమైన శరీరమును పొందుదుము (1 కొరింథీయులకు 15:50–57; 1 యోహాను 3:2) మనము పరలోకమందు దేవునితో కూడ శాశ్వతముగా జీవించుదుము, అచ్చట మరణమైనను, దుఃఖమైనను, ఏడ్పైనను, లేక వేదనయైనను యిక ఉండదు (ప్రకటన 21:4 చూడు).

డేవిడ్ స్టూవర్ట్

---

సూచనలు

[1]*Leviticus Rabbah* 16.6, 7; 17.3; *Numbers Rabbah* 7.5; 16:6; *Deuteronomy Rabbah* 6.8. [2]Robert H.Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 73. [3]James F. Strange and Hershel Shanks, “Has the House Where Jesus Stayed in Capernaum Been Found?” and “Synagogue Where Jesus Preached Found at Capernaum,” in *Archaeology and the Bible: The Best of BAR,* vol. 2, *Archaeology in the World of Herod, Jesus and Paul,* ed. Hershel Shanks and Dan P. Cole (Washington, D.C.: Biblical Archaeology Society, 1990), 188-99, 200-7 చూడు. [4]Tacitus *Annals* 4.5. Everett Ferguson, *Backgrounds of Early Christianity,* 2d ed. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1993), 46-48. [5]David Hill, *The Gospel of Matthew,* The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 158. [6]Leon Morris, *Luke: An Introduction and Commentary,* rev. ed., The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 151. [7]యోహాను వ్రాసిన సువార్తలో “రాచరిక అధికారి” చేరియుండిన ఇదే విధమైన ఒక కథ కూడ కపెర్నహూములు జరిగినది (యోహాను 4:46–54) ఏదిఏమైనా, అక్కడ “కుమారుడు” (huios) అను పదము వాడబడినది, “దాసుడు” అను పదము కాదు. [8]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 90. [9]Mounce, 74. [10]Mishnah *Oholoth* 18.7.

[11]Hare, 91. [12]S. Scott Bartchy, “Table Fellowship,” in *Dictionary of Jesus and the Gospels,* ed. Joel B. Green and Scot McKnight (Downers Grove, Ill.: InterVarsity Press, 1992), 796. [13]H. Leo Boles, *A Commentary on the Gospel According to Matthew* (Nashville: Gospel Advocate Co., 1936), 191. [14]Leon Morris, *The Gospel according to Matthew,* Pillar Commentary (Grand Rapids

Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 195. [15]Jack P. Lewis, *The Gospel according to Matthew,* Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 123. [16]Donald A Hagner, *Matthew 1-13*, Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 209. [17]సబ్బాతు దినానా ఏ ఒక్కరను ఏ పనైనను చేయకూడదని చెప్పుటకు యూదా మత బోధకుల ముప్పది తొమ్మిది నిషేదాజ్ఞల తయారుచేసారు. వీటిలో చివరిది, ఏదైన ఒక వస్తువును ఒక ప్రదేశము నుండి మరొక ప్రదేశమును తీ(మో)సికొనిపోవువానికి వ్యతిరేకమైనదై యుండెను. (Mishnah *Shabbath* 7.2.) ఏదిఏమైనా, సజీవముగా నున్న ఒక మనిషిని వాని పడకతోపాటు మో(తీ)సికొని వెళ్ళువాడు మినహాయింపబడినాడని ఒక రబ్బి తెలియజెప్పాడు. (Mishnah *Shabbath* 10.5.) [18]*Testament of Solomon* 2.4; 5.5, 13; 8.5-11; Tobit 6:7, 8, 16-18; 8:2, 3; Josephus *Antiquities* 8.2.5. [19]Graham H. Twelftree, "Demon, Devil, Satan," in *Dictionary of Jesus and the Gospels,* ed. Joel B. Green and Scot McKnight (Downers Grove, Ill.: InterVarsity Press, 1992), 167. [20]Albert Barnes, *Notes on the New Testament: Matthew and Mark,* ed. Robert Frew (Philadelphia: N.p., 1832; reprint Grand Rapids, Mich.: Baker Book House, 1974), 88. NRSV బైబిల్‌లో యెషయా 53:4 మరియు మత్తయి 8:17 పోల్చి చూడు.

[21]Lewis, 124. [22]D. A. Carson, *When Jesus Confronts the World: An Exposition of Matthew 8-10* (Grand Rapids, Mich.: Baker Book House, 1987), 33. [23]Morris, *Matthew,* 198. [24]John Phillips, *Exploring the Gospel of Matthew: An Expository Commentary*, The John Phillips Commentary Series (Grand Rapids, Mich.: Kregel Publications, 1999), 151. [25]William M. Taylor, *The Miracles of Our Savior* (New York: Doubleday, Doran & Co., 1928), 26. [26]*The American Heritage Dictionary,* 4th ed. (2001), s.v. "miracle." [27]C. S. Lewis, *Miracles: A Preliminary Study* (New York: Macmillan Co., 1947), 10. [28]Henry Snyder Gehman, ed., "Miracle," *The New Westminster Dictionary of the Bible* (Philadelphia: Westminster Press, 1970), 622. [29]Hagner, 211.